క్లుప్తంగా

విద్యార్థులు భయాన్ని వీడాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్ రెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడాలని ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్ రెడ్డి సూచించారు. ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు, శ్రీనివాసులు, సురాంజనేయులు, రామాంజిరెడ్డి, టీచర్లు సతీష్, గంగాధర్, మరళి, తిప్పేస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరీదేవికి ప్రత్యేక పూజలు



బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని రామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కొలువుదీరిన గౌరీదేవికి పూజలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఐదు రోజులు పాటు పూజలు నిర్వహించిన అనంతరం గ్రామోత్సవం, నిమజ్జన కార్యక్రమాలతో గౌరీదేవి పూజలు ముగుస్తాయని అర్చకుడు తిప్పేస్వామి తెలిపారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని మురడిలో సోమవారం ఉదయం 7 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ లతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘం నాయకులు, అధికారులు, వలంటీర్లు హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం



గొటుకూరుకు సిమెంట్ రోడ్డు వేసిన దృశ్యం

కూడేరు: ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి చొరవతో కూడేరు మండలంలోని గొటుకూరు గ్రామానికి వెళ్లే రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి నుంచి గొటుకూరు గ్రామానికి 1.8 కిమీ దూరం ఉంది. కొన్నేళ్లు నుంచి ఈ రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా ఉండేది. వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడేవారు. వైఎస్సార్‌సీపీ నేతలు మదన్‌మోహన్ రెడ్డి, హనుమంతరెడ్డి, సూర్యనారాయణ, గ్రామస్తులు రోడ్డు సమస్యను విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఏఐబీ గ్రాంట్ రూ.1.42 కోట్లతో సిమెంట్ రోడ్డు మంజూరు చేయించారు. ఆ నిధులతో రెండు చోట్ల కల్వర్టులు నిర్మించి సిమెంట్ రోడ్డు వేశారు. సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం



ట్రాక్టర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లిలో గొల్ల గోవిందప్ప పొలంలో పనులు ముగించుకుని ఆదివారం సాయంత్రం ట్రాక్టర్‌లో ఇంటికి వస్తుండగా.. అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి ట్రాక్టర్ బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

శుభకార్యం

కంబదూరు: మండలంలోని అచ్చంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షఫీ కుమారుడు రహంతుల్లా–నూర్జహాన్ వివాహానికి రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మంత్రి వెంట రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, పార్టీ మండల కన్వీనర్ బాలరాజు యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్ తదితరులున్నారు.

'వికసిత్' యాత్ర ప్రారంభం

శెట్టూరు/కూడేరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శెట్టూరు మండలంలోని యాటకల్లులో ప్రారంభించారు. సర్పంచ్ ఈరన్న, మాజీ ఎంపీపీ రామభీమప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు, ఎంఈఓ శ్రీధర్,పాల్గొన్నారు. అలాగే కూడేరు మండలంలోని గొటుకూరు, కమ్మూరు పంచాయతీల్లో ఆదివారం నిర్వహించిన వికసిత్ భారత సంకల్ప యాత్రలో సర్పంచులు ఆశాలత, చిన్న రంగారెడ్డి, వైద్యాధికారిణి సౌమ్య, ఎంపీడీఓ ఎంకే బాషా పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడతామని ప్రమాణం చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, నాయకులు

రాయదుర్గం: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమైనదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగం మూలస్తంభమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కొనియాడారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ నగర్ వద్ద రాజ్యంగం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, పార్టీ పట్టణ కన్వీనర్ ఆరవ శివప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్ శారదమ్మ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులుతో కలసి విప్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి, రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడేలా ప్రమాణం చేయించారు. అనంతరం విప్ మాట్లాడారు.. దేశంలోని రాజ్యాంగ ఔన్నత్యాన్ని, చట్టబద్ధ పాలనను పరిరక్షించేందుకు ప్రజలందరూ పునరంకితం కావాలని ఉద్బోధించారు. అంబేడ్కర్ ఆశయసాధనకు కట్టుబడి రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం సాకారం చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, ఐనాపురం మంజునాథ, కొంతెం దేవరాజు, డిష్ గోవిందు, పక్కీర్డీన్, షబ్బీర్, కో–ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, కడ్డిపుడి నజీర్, పార్టీ ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులు

గుమ్మఘట్ట ప్రజాస్వామ్యానికి హక్కులే పునాదులని ప్రభుత్వ విప్ రామచంద్రారెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విప్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. అనంతరం రాజ్యాంగానికి, చట్టానికి, న్యాయానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, సర్పంచులు కోట్ల ఉమేష్‌రెడ్డి, రాజేష్, ఎంపీటీసీలు మారెక్క, గోవిందు, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, బేలోడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కొండయ్య, ఎంఈఓ వెంకటరమేష్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు

కణేకల్లు: మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు హంపీ, నాగరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్ వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు రామకృష్ణ, ఆనంద్‌రెడ్డి, వన్నూరుస్వామి, బడిగే వన్నూరుస్వామి, వీరన్నగౌడ్, సురేష్, వంశీ, రాజశేఖర్, మంజప్ప పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు ఎంపీడీఓ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న , జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచ్‌లు రామిరెడ్డి,పురుషోత్తం, వైస్ ఎంపీపీ రేఖమ్మ, ఆవులెన్న సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలో భారత రాజ్యాంగ దినోత్సవం ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఉపసర్పంచ్ వన్నప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, నాయకులు ఓబన్న, ఈడిగ ప్రసాద్,ఆసీఫ్, వడ్ల షేక్షావలి,ఆంజినేయులు, అంగదాల ఆంజి తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం సచివాలయంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచులు హనుమంత రెడ్డి, చిన్న రంగారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలకేంద్రంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బెంజిమెన్, జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



గుమ్మఘట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ మారుతమ్మ, అధికారులు, నాయకులు



కళ్యాణదుర్గంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

కళ్యాణదుర్గం: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ, సచివాలయాల కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరుస్వామి, రామచంద్ర, సుధీర్, తిరుమల వెంకటేశులు, పోస్ట్ కిష్ట, మల్లికార్జున, రాజగోపాల్, బిక్కి నాగలక్ష్మి, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, ఉమాపతి, అఫ్జల్, ఉమేష్, రాము, గాజుల అంజి, పాండు, బిక్కిహరి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ మారుతమ్మ, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు మల్లికార్జున, రామకృష్ణ. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శెట్టూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామారావు ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కుందుర్పి: స్థానిక ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ కమలమ్మ, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సర్పంచ్ మారుతేశ్వరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లక్ష్మణమూర్తి, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే సీఎం లక్ష్యం



బ్రోచర్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



బీటీపీ రిజర్వాయర్‌లోకి చేపపిల్లలను వదులుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం(డి హీరేహాళ్): పేదరికం లేని సమాజం నెలకొల్పాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం డి హీరేహాళ్ మండలం మురడి గ్రామ పంచాయతీ పరిధిలోని తమ్మేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్ స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచ్ గంగప్ప తదితరులతో కలసి విప్ ఇంటింటికీ వెళ్లారు. గడిచిన నాలుగున్నరేళ్లలో పొందిన లబ్ధిపై బ్రోచర్‌కార్డు అందజేశారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు. పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోనూ 1.4 లక్షల గడపలు తాకి వారి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఇప్పటి వరకు తానొక్కడేనని గర్వంగా చెప్పారు. మురడితో ఈ కార్యక్రమం దిగ్విజయవంతంగా ముగుస్తుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసుల శకం ముగిసినట్టేనన్నారు. ఈ ఇద్దరి జమానాలో స్కీములన్నీ స్కాములుగానే మిగిలిపోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ దోపిడీ దొంగలకు రాజకీయ సమాధి తప్పదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, పుత్రుడు, దత్తపుత్రుడు, ఎల్లోమీడియా ఇలా అంతా కలసికట్టుగా దుష్ప్రచారం చేసినా 2024 ఎన్నికల్లో జగన్ ప్రభంజనాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, డీటీ బసవకుమార్, పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు బసవరాజు, సర్పంచులు బోయ మల్లికార్జున, పరమేష్, నాగరాజు, హనుమంతరెడ్డి, పెద్ద ఆంజనేయ, రుద్రేష్, బొమ్మన్న, ఎంపీటీసీ కల్యాం సురేష్, సంజీవ, నాయకులు సురేష్‌యాదవ్, తొండ వెంకటేశులు, ఎస్.వన్నూరప్ప, సింగాడి మంజు, నాగయ్య, యల్లప్ప, ఖాసీంపీరా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు జీవనోపాధి

గుమ్మఘట్ట: మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. జిల్లా ఫిషరీస్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బీటీ ప్రాజెక్టులోకి పీఎంఎంవై పథకం ద్వారా 6.44 లక్షల చేపపిల్లల (కట్ల, రోహు, మృగాలు)ను విప్ వదిలారు. విప్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం వసతులు కల్పించి ప్రోత్సాహిస్తోందన్నారు. తుంగభద్ర కెనాల్ కింద సాగు చేసిన పంటలు నష్టపోతామని పలువురు రైతులు విన్నవించడంతో.. సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనంగా మరో టీఎంసీ నీటిని అందించి పంటలను కాపాడామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కణేకల్లు చెరువు పూడికతీత పేరుతో టీడీపీ నాయకులు రూ.2 కోట్లను దోపిడీ చేశారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ లక్ష్మీ నారాయణ, పీఏబీఆర్ ఏఫ్‌డీఓ పెద్దబాబు నాయక్, మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, సర్పంచులు కోట్ల ఉమేష్‌రెడ్డి, రాజేష్, ఎంపీటీసీలు మారెక్క, గోవిందు, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, సచివాలయాల మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సన్మానం



ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఉరవకొండ: నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి కృషి చేసిన శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డిని ఆదివారం ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని ఎమ్మెల్సీ నివాసంలో కార్యక్రమం నిర్వహించారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్దతండా గ్రామంలో భద్రంపల్లి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం దేవదాయ శాఖ నుండి సీజీఎఫ్ గ్రాంట్ కింద రూ.60 లక్షలు ఎమ్మెల్సీ మంజూరు చేయించారు. అలాగే టీటీడీ దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కృషితో పెన్నహోబిళంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.1.25 కోట్లు, తిరుమల, తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా చిన్నముస్టురులోని ఆంజనేయస్వామి ఆలయానికి రూ.27 లక్షలు మంజూరు చేయించారు. ఎమ్మెల్సీను సత్కరించిన వారిలో బీకానాయక్, తులసీనాయక్, లక్ష్మానాయక్, వాళ్య, ముత్యాలు తదితరులున్నారు.

కాలవా.. నీచ రాజకీయాలు మానుకో



మాట్లాడుతున్న జక్కలవడికి గ్రామస్తులు

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీలపై దౌర్జన్యం చేస్తున్నారంటూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చుపెట్టి నీచ రాజకీయాలు చేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులుకు జక్కలవడికి వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచు శారదమ్మ భర్త హనుమంతరెడ్డి హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ మెకానిక్ వెంకటేశులు, బోయ రామక్రిష్ణ, ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డితో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హనుమంతరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి కంచుకోట జక్కలవడికి గ్రామంలో రాజకీయంగా లబ్ధి పొందాలని మాజీ మంత్రి కాలవ నీచరాజకీయాలకు తెరలేపారన్నారు. నాలుగు రోజుల క్రితం దాసప్ప, అతని భార్య వసంతమ్మ తాగునీటి పైప్‌లైన్‌ను డామేజ్ చేసేలా పొలం చదను పనులు చేస్తుండగా గ్రామస్తులతో కలసి పనులను అడ్డుకున్నామన్నారు. ఏం జరిగిందో తెలుసుకోకుండా ఎక్కడో ఏసీల్లో కూర్చొని వైఎస్సార్‌సీపీ నాయకులు బీసీలపై దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపణలు చేయడం కాలవకు మంచి పద్ధతి కాదన్నారు. టీడీపీకి భవిష్యత్తు లేక పోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులను తప్పు బట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కాలవ చూస్తున్నారంటూ వారు మండిపడ్డారు. గ్రామంలో రూ.50 లక్షలతో సిమెంటు రోడ్డు, రూ.1.50 కోట్లతో తారు రోడ్డు, రూ.కోటితో మట్టి రోడ్డు, గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిందన్నారు. కుక్కలా నోటికొచ్చినట్లు మొరిగి వాస్తవాలను కప్పిపుచ్చి దుష్ప్రచారం చేసినా టీడీపీ ఎన్నటికీ అధికారంలో రాదన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవడం ఖాయమన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బాధితుడికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు బద్దేనాయక్ ఆదివారం రూ.15 వేలు ఆర్థికసాయం చేశాడు. పట్టణంలోని ఎర్రనేల వీధికి చెందిన పాతన్న గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం అతడికి ఉపాధ్యాయుడు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచాడు. కాగా పాతన్నకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన భార్య సుశీల దోసెలు అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు హౌసింగ్ లబ్ధిదారుల సమావేశం

ఉరవకొండ: పట్టణంలోని వీరశైవ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హౌసింగ్ లబ్దిదారుల సమావేశం నిర్వహించనున్నట్లు ఏఈ అశ్వర్థ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, హౌసింగ్ అధికారులు, ఎంపీపీ, జెడ్పీటీసీలు సమావేశానికి హాజరవుతారన్నారు. ఉరవకొండ కొలిమి, రాయంపల్లి, బాలయోగి లేఅవుట్లలో ఇల్లు మంజూరై, నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులు, బేస్మెంట్ లెవెల్ వరకూకట్టిన వారు హాజరు కావాలన్నారు.

సబ్సిడీతో పాడి గేదెలు

కుందుర్పి: జంబుగుంపల పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల్లో ఆర్డీటీ ఆధ్వర్యంలో 80 మంది మహిళలకు పాడి గేదెలు మంజూరైనట్లు ఆ సంస్థ ఎస్టీఓలు రామాంజనేయులు, వెంకటేష్ తెలిపారు. ఆదివారం 30 మంది మహిళలకు రూ.50 వేలు విలువ చేసే పాడిగేదెలు పంపిణీ చేశామని, మూడు రోజుల్లో మిగిలిన వారికి గేదెలు పంపిణీ చేస్తామన్నారు. పాడి ద్వారా మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని వారు సూచించారు.

వైభవంగా జ్వాలాదీప దర్శనం



ఉరవకొండ: కార్తీక జ్వాలా దీప దర్శనంలో పాల్గొన్న భక్తులు



కూడేరు: జోడు లింగాల ఆలయంలో దీపోత్సవ దృశ్యం



బెళుగుప్ప: రామేశ్వరస్వామి ఆలయ జ్వాలాతోరణ దర్శనంలో పాల్గొన్న భక్తజనం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలోని లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం జ్వాలా దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జ్వాలాదీప దర్శనానికి జిల్లా నలమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని దర్శించుకున్నారు.

కూడేరు: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి దేవాలయంలో దీపోత్సవం, జ్వాలా తోరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. జిల్లా నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పురోహితులు శివశంకర్ శాస్త్రి, సురేష్‌శాస్త్రి, మహేష్, ప్రవీణ్‌స్వాములు, దేవదాయ శాఖ అధికారులు, ఆలయ సేవా కమిటి సభ్యులు పాల్గొన్నారు.



ఉరవకొండ: గవిమఠం లక్ష దీపోత్సవంలో పెద్దఎత్తున పాల్గొన్న మహిళలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం, జ్వాలాతోరణ దర్శన పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని వేంకటేశ్వర స్వామి గుడిలో భక్తులు దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామిని పట్టణంలో ఊరేగించారు.

గవిమఠంలో లక్షదీపోత్సవం

ఉరవకొండ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధిగాంచిన గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం రాత్రి లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. గవిమఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం గవిమఠం ఆవరణలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు.

లత్తవరంలో వన భోజన సందడి

ఉరవకొండ: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లత్తవరం ఉమామహేశ్వర ఆశ్రమంలో వన భోజనాల చేయడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. ముందుగా ఆశ్రమంలో శివాలయంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి ఉసిరి చెట్ల కింద వనభోజనాలు చేశారు.

రేపు సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని మంత్రి కార్యాలయంలో మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్ అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివారం మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సైనికులందరూ హాజరు కావాలన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బ్రహ్మసముద్రం: మండలంలోని పొబ్బర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఛేంజ్ ఫర్ సొసైటీ టీం ఆధ్వర్యంలో మంగళవారం కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మమత సూచించారు.